నమస్తే తెలంగాణ
వికారాబాద్
I హైదరాబాద్, బుధవారం 20 నవంబర్ 2024 VIKARABAD

## 21న జిల్లాకు బీసీ కమిషన్ బృందం రాక..

ఆదిబట్ల, నవంబర్ 19 : స్థానిక సంస్థల వారీగా కల్పించాల్సిన రిజర్వేషన్ల దామాషాను అధ్యయనం చేసేందుకు ఈ నెల 21న జిల్లాకు బీసీ కమిషన్ బృందం రానున్నదని రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. ఈ బృందం ఎదుట రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, ప్రజలు తమ అభిప్రాయాలను వెల్లడించాలన్నారు. రంగారెడ్డి, మేడ్చల్, మల్కాజ్‌గిరి, వికారాబాద్ ఉమ్మడి జిల్లాలకు సంబంధించిన వారి కోసం బీసీ కమిషన్ బృందం రంగారెడ్డి జిల్లాకు రానున్నదన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కమిషన్ చైర్మన్ నిరంజన్ నేతృత్వంలో సభ్యులు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి, బీసీ వెల్ఫేర్ కమిషనర్లతో హాజరై ప్రజాభిప్రాయాన్ని సేకరిస్తారన్నారు. అభిప్రాయాలను తెలియజేయాలనుకునేవారు రాతపూర్వకంగా, లేదా అభ్యర్థులకు నేరుగా సమర్పించవచ్చునన్నారు. వారి అభ్యర్థనతో పాటు నిర్దేశిత నమూనాలో వెరిఫికేషన్ అఫిడవిట్ ఆరుసెట్లను తెలుగు లేదా ఇంగ్లిషులో ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ఇతరత్రా ఏమున్నా కమిషన్ దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ వివరించారు.



ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపో ఎదుట ఆందోళన చేస్తున్న సీఐటీయూ నాయకులు

## వ్యర్థాల తరలింపు గాడితప్పింది

**భవన నిర్మాణ వ్యర్థాలతో డంపింగ్ కేంద్రాలుగా ఖాళీ స్థలాలు, చెరువులు**

**నిర్వహణలో ఏజెన్సీకి, జీహెచ్‌ఎంసీకి మధ్య సమన్వయ లోపమే కారణం**

సిటీబ్యూరో, నవంబర్ 19(నమస్తే తెలంగాణ): జీహెచ్‌ఎంసీలో భవన నిర్మాణ వ్యర్థాల తరలింపు ప్రక్రియ గాడి తప్పుతోంది. కూల్చివేసిన సీ అండ్ డీ (కన్‌స్ట్రక్షన్స్ అండ్ డీమాలిషన్) వ్యర్థాల తరలింపులో సమన్వయలోపం కొట్టొచ్చినట్లు కనబడుతున్నది. భవన నిర్మాణాల వ్యర్థాలను రీ సైక్లింగ్ చేసి రీయూజ్ (పునర్ వినియోగం)లోకి తీసుకువచ్చేందుకుగానూ నగరం నలుమూలల జీడిమెట్ల, ఫతుల్లాగూడ, శంషాబాద్, తూంకుంటలో నాలుగు ప్లాంట్లను ఏర్పాటు చేశారు. ఒక్కో ప్లాంట్ నుంచి రోజుకు 500 మెట్రిక్ టన్నుల చొప్పున 2వేల మెట్రిక్ టన్నుల వ్యర్థాలను శుద్ధి చేస్తున్నారు. అయితే గడిచిన కొన్ని నెలలుగా ఈ భవన నిర్మాణ వ్యర్థాల తరలింపు సజావుగా జరగడం లేదు. వాస్తవంగా ఏదైనా భవన నిర్మాణం, కూల్చివేతల తాలూకా వ్యర్థాల తరలింపులో భారీ స్థాయిలో అయితే టోల్ ఫ్రీ నంబర్ 1800 120 1159లో, వాట్సాప్ నంబర్ 91009 27073లో చెబితే సంబంధిత ఏజెన్సీ వారు వచ్చి వారీ వారీ ప్లాంట్లకు తీసుకువెళ్తారు. జీహెచ్‌ఎంసీ నిర్దేశించిన రేటు ప్రకారం మెట్రిక్ టన్నుకు నిర్ణీత రేటును వసూలు చేస్తారు. చిన్న స్థాయిలో (లోడు కంటే తక్కువ) ఉన్న వ్యర్థాలను సంబంధిత మేస్త్రీ ఏదో చోటకు చేర్చి ఆ తర్వాత ఏజెన్సీకి అప్పగించి సంబంధిత నగదును మేస్త్రీ తీసుకుంటారు. కానీ మేస్త్రీలకు ఏజెన్సీలకు, జీహెచ్‌ఎంసీ అధికారుల మధ్య సమన్వయలోపం ఉంటున్నది. ఈ నేపథ్యంలోనే చాలా వరకు ప్రాంతాల్లో యాజమానులు, మేస్త్రీలు ఖాళీ స్థలాలు, చెరువుల పక్కన, నాలాల పక్కన రాత్రికి రాత్రే డంపింగ్ చేసి చేతులు దులుపుకొంటున్నారు. దీంతో స్వచ్ఛ హైదరాబాద్ లక్ష్యంగా నీరుగారుతోంది. భవన నిర్మాణ వ్యర్థాలను ఒక చోటకు చేర్చేందుకు ఇటీవల కాలంలో 12 కలెక్షన్ పాయింట్లను ఏర్పాటు చేశారు. ఇందుకు సుమారు మెట్రిక్ టన్నుకు రూ. 398.50లు, యూజర్ చార్జీలు రూ. 99.62లు అదనంగా వసూలు చేస్తున్నది. దీంతో జీహెచ్‌ఎంసీ ఆయా ఏజెన్సీలకు వ్యర్థాల తరలింపు బకాయి పడింది. దాదాపు రూ. 7కోట్లకు పైగా జీహెచ్‌ఎంసీ నుంచి బకాయిలు రావాల్సి ఉందని, సీ అండ్ డీ ప్లాంట్ల నిర్వహణ భారంగా మారుతుందని ఏజెన్సీలు జీహెచ్‌ఎంసీ అల్టిమేటం జారీ చేసేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది.



కొంగరకలాన్ వద్ద సర్వేను అడ్డుకుంటున్న రైతులను బలవంతంగా ఆదిబట్ల ఠాణాకు తరలిస్తున్న పోలీసులు

*ఉమ్మడి రంగారెడ్డి జిల్లావ్యాప్తంగా నిరసనల హోరు కొనసాగుతున్నది. ఇటీవల జరిగిన లగచర్ల లడాయితో ఫార్మా బాధితులు భగ్గుమనగా.. తమ గుండెలు మండిపోయి తెగించి కొట్లాడుతుండగా.. ప్రజా శ్రేయస్సును విస్మరించి చేపట్టిన దామగుండంలోని నేవీ రాడార్ విషయంలోనూ పెద్ద ఎత్తున ఆందోళనలు, నిరసనలతో దద్దరిల్లిన సంగతి తెలిసిందే. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఊకదంపుడు ఉపన్యాసాలు.. అలవికాని హామీలిచ్చి వాటిని నెరవేర్చకుండా కాలయాపన చేస్తుండడంతో మంగళవారం నిరసనలు, దీక్షలు చేపట్టారు. ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని కొంగరకలాన్ కలెక్టరేట్ వెనుక ప్రాంతంలో ఫోర్త్‌సిటీ రోడ్డు ఏర్పాటు కోసం సర్వే చేసేందుకు వచ్చిన అధికారులతో రైతులు వాగ్వాదానికి దిగి అడుగడుగునా అడ్డుకున్నారు. ఆర్టీసీ కార్మికులపై ఆంక్షలను ఎత్తివేసి, సంఘం ఎన్నికలు నిర్వహించాలని ఇబ్రహీంపట్నం బస్‌డిపో ఎదుట ఆందోళన చేశారు. ఇచ్చిన మాట ప్రకారం పింఛన్లు పెంచాలని దివ్యాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో వికారాబాద్, ఆదిబట్లలో నిరసనలు చేపట్టారు. రాష్ట్ర సర్కార్ ప్రజలను క్షోభకు గురిచేస్తున్నదని.. ఇప్పటికైనా ప్రజావ్యతిరేక విధానాలను మానుకోవాలని.. లేదంటే రాబోవు రోజుల్లో కాంగ్రెస్ పార్టీని కచ్చితంగా బంగాళాఖాతంలో కలుపుతామని ఉమ్మడి జిల్లావాసులు ముక్తకంఠంతో నినదిస్తున్నారు.*

*- న్యూస్ నెట్‌వర్క్, నమస్తే తెలంగాణ*

# నిరసనల హోరు..

**ఉమ్మడి రంగారెడ్డి జిల్లావ్యాప్తంగా ఆందోళనలు.. కొనసాగుతున్న రిలే దీక్షలు... ప్రజా సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ సర్కార్ విఫలం**

## కలెక్టరేట్ వద్ద చస్తాం..

**భూమి పోతే ఆత్మహత్యే శరణ్యం**
**ఫోర్త్‌సిటీ రోడ్డు సర్వేను ప్రతిఘటించిన రైతులు**
**సమాచారం లేకుంటే భూముల్లో ఎందుకు సర్వే చేస్తున్నారని మండిపాటు**
**కొంగరకలాన్ వద్ద సర్వేను అడ్డుకున్న రైతులు..**
**పోలీస్ పహారాలో కొనసాగిన సర్వే**

ఉన్న కాస్తా పొలం ఫోర్త్‌సిటీ రోడ్డు కోసం పోతే తాము ఎలా బతకాలని అన్న దాతలు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని కొంగరకలాన్ కలెక్టరేట్ వెనుక ప్రాంతంలో ఫోర్త్‌సిటీ రోడ్డు ఏర్పాటు కోసం సర్వే చేసేందుకు వచ్చిన అధికారులతో రైతులు వాగ్వాదానికి దిగి అడుగడుగునా అడ్డుకున్నారు. సమాచారం లేకుండా తమ భూముల్లో ఎందుకు సర్వే చేస్తున్నారని మండిపడ్డారు. దీంతో అధికారులు పోలీసులకు సమాచారమివ్వగా అక్కడికి చేరుకుని రైతులను ఆదిబట్ల ఠాణాకు తరలించేందుకు యత్నించినా.. సర్వే పనులను మాత్రం సాగనివ్వలేదు. దీంతో వారిని బలవంతంగా ఠాణాకు తీసు కెళ్లగా.. మహిళలను అక్కడి నుంచి నెట్టివేసి.. పోలీసుల బందోబస్తు మధ్య సర్వే చేపట్టారు. రోడ్డు కోసం 300 ఫీట్ల రోడ్డు ఎందుకు, 200 ఫీట్లు అయితే అందరం సంతోషంగా ఇస్తామన్నారు. భూమి పోతే మాకు ఆత్మహత్యే శరణ్యమని, కలెక్టరేట్ వద్ద చస్తామని హెచ్చరించారు. అక్కడే ఉన్న శ్రీనివాస్ అనే రైతు సర్వే పనులను నిలిపేయాలని పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేయగా అతడి వద్ద ఉన్న పెట్రోల్ డబ్బాను పోలీసులు స్వాధీనం చేసుకుని ఠాణాకు తరలించారు.

-రంగారెడ్డి, నవంబర్ 19 (నమస్తే తెలంగాణ)/ కందుకూరు

## ఆర్టీసీ కార్మిక సంఘాలపై ఆంక్షలు ఎత్తివేయాలి..

**ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికలు జరపాలి**
**ఇబ్రహీంపట్నం బస్ డిపో ఎదుట**
**ఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన**

ఇబ్రహీంపట్నం రూరల్, నవంబర్ 19 : ఆర్టీసీ కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, ఆర్టీసీ కార్మిక సంఘాలపై ఆంక్షలు ఎత్తివేసి వెంటనే సంఘం ఎన్నికలు నిర్వహించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం ఇబ్రహీంపట్నం బస్‌డిపో ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి బ్రహ్మయ్య మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ నిర్వహణలో కార్మిక సంఘాలకు భాగస్వామ్యం కల్పించాలని, ప్రజాతంత్ర హక్కులను పునరుద్ధరించాలన్నారు. కార్మికుల వేతనంపై పీఆర్సీ అమలు చేశారే తప్పా.. హెచ్‌ఆర్‌ఏ, డీఏ, స్టాండింగ్ అలవెన్స్, నైట్‌ఔట్ అలవెన్స్ డే అవుట్ అలవెన్స్, స్పెషల్ అలవెన్స్, వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ఆర్టీసీ యూనియన్ కార్యకలాపాలకు అనుమతి ఇస్తామని, కాంగ్రెస్ పార్టీ కార్మికులకు హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి 11నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు హామీలు అమలు చేయడం లేదన్నారు. ఇప్పటికైనా ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పోచమోని కృష్ణ, ఎల్లేశ్, బుగ్గ రాములు, చందూనాయక్, సత్యనారాయణ, యాదగిరి, విఘ్నేశ్, యాదయ్య, వీరేశ్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

## పింఛన్లు పెంచేదెప్పుడూ..



వికారాబాద్‌లోని దీక్షలో మాట్లాడుతున్న దివ్యాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగయ్య

- **దివ్యాంగులను రేవంత్ సర్కార్ మోసం చేస్తున్నది..**
- **ఎన్నికలకు ముందు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలి**
- **దివ్యాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగయ్య, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కరంటోత్ శ్రీనివాస్**

వికారాబాద్, నవంబర్ 19 : 'ఎన్నికలకు ముందు పింఛన్లు పెంచుతామని ఇచ్చిన మాటను కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకోవాలి.. ఎప్పటి నుంచి పెంచుతారో స్పష్టం చేయాలి..' అని దివ్యాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగయ్య డిమాండ్ చేశారు.వికారాబాద్ జిల్లా కేంద్రంలో జరిగిన రెండో రోజు నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ హామీలు ఇచ్చి విస్మరించిందని, వాటిని అమలు చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్‌ల ఎదుట దీక్షలు చేపడుతామని హెచ్చరించారు. ఈ నెల 26న చలో ఇందిరా పార్కు మహా ధర్నాకు పిలుపునిస్తున్నామని తెలిపారు. పింఛన్లు పెంచాలని కోరుతూ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్‌లకు వినతి పత్రం అందజేశామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సహాయక కార్యదర్శి విజయ్‌కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్ల రాజు, జిల్లా అధ్యక్షుడు ఊరడి శ్యాంప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి కలాల్ బాల్‌రాజు గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు బంటూ వెంకటయ్య పాల్గొన్నారు.

**ఆదిబట్లలో రిలే నిరాహార దీక్షలు..**

ఆదిబట్ల : ఆసరా పింఛన్‌దారులను రేవంత్‌రెడ్డి సర్కారు మోసం చేస్తున్నదని దివ్యాంగుల హక్కుల పోరాట సమితి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కరంటోత్ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ ఎదుట దివ్యాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఆసరా పింఛన్‌దారులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలను శ్రీనివాస్ ప్రారంభించి మాట్లాడారు. దివ్యాంగులకు రూ.6 వేలు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, చేనేత గీత, బీడీ కార్మికులకు రూ.4వేలు పింఛన్ పెంచుతామని చెప్పి అధికారంలోకి రాగానే మర్చిపోవడం విడ్డూరంగా ఉన్నదన్నారు. ఇప్పటికైనా స్పందించకపోతే మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో లక్షల మందితో ఈ నెల 26న చలో హైదరాబాద్ చేపడుతామని హెచ్చరించారు. ఈ దీక్షలో జిల్లా ప్రధాన కార్యదర్శి యాచారం జంగయ్య, గువ్వల యాదయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు మహ్మద్ సలీం, జిల్లా నాయకులు ఆకుల సంజీవ, భానుప్రసాద్, లింగమయ్య పాల్గొన్నారు.

**ఆ నాలుగు చెరువుల సుందరీకరణ ఊసేలేదు**
**బడ్జెట్ లేకపోవడమే కారణమా..**
**బతుకమ్మకుంట, ఎర్రకుంట సుందరీకరణపై దృష్టి**

# అటకెక్కిన హైడ్రా పైలట్ ప్రాజెక్ట్

సిటీబ్యూరో, నవంబర్ 19(నమస్తే తెలంగాణ): హైదరాబాద్ నగరంలో చెరువుల సుందరీకరణ, పునరుజ్జీవం అంటూ కూల్చివేతల పేరుతో హల్‌చల్ చేసిన హైడ్రాకు ఆదిలోనే హంసపాదు ఎదురైంది. తాము ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న చెరువుల పైలట్ ప్రాజెక్ట్ మొదట్లోనే ఆగిపోవడంతో షాక్ తగిలినట్లయింది. పైలట్ ప్రాజెక్ట్‌గా చేపట్టాలనుకున్న నాలుగు చెరువుల సుందరీకరణ పనులు ప్రణాళికల దగ్గరే ఆగిపోయాయి. నగరానికి నాలుగు వైపులా 4 చెరువులను సుందరీకరించి హైడ్రా మార్క్‌ను ప్రదర్శించాలనుకున్న కమిషనర్ రంగనాథ్ ఆ చెరువుల ఊసే ఎత్తడం లేదు. హైడ్రా పైలట్ ప్రాజెక్ట్‌లో భాగంగా ఈస్ట్, వెస్ట్, నార్త్, సౌత్‌లలో ఒక్కో చెరువును ఎంపిక చేసుకుని మొదట 4 చెరువులను అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. ప్రాజెక్ట్‌లో బాచుపల్లి-ఎర్రగుంట చెరువు, మాదాపూర్-సున్నం చెరువు, కూకట్‌పల్లి-నల్లచెరువు, రాజేంద్రనగర్-అప్పా చెరువులను ఎంపిక చేసింది. చెరువుల సుందరీకరణను ఆరు నెలల్లో పూర్తిచేయాలనుకున్నారు. ఇందులో భాగంగా మొదట బాచుపల్లి ఎర్రగుంట చెరువు వద్ద శిథిలాల తరలింపు విమర్శలకు దారితీయడమే కాకుండా ఖర్చుతో పాటు శిథిలాలను ఎక్కడ పోయాలన్న ప్రశ్నలు ఎదురయ్యాయి. ఆ తర్వాత మిగతా మూడు చెరువుల విషయంలో కనీసం శిథిలాల తరలింపు కానీ ఇతర పునరుజ్జీవ పనుల మాటే వినిపించడం లేదు. ఈ నాలుగు చెరువులపై మొదట్లో దృష్టి పెట్టినప్పటికీ.. వాటి పునరుజ్జీవం, సుందరీకరణ పనులకు కోట్ల రూపాయలు ఖర్చవుతుందని అధికారులు అంచనా వేయడంతో బడ్జెట్ కారణంగా తాత్కాలికంగా ఆ పనులను ఆపేసినట్లు సమాచారం.

## స్థలాల ఆక్రమణలపై దృష్టి..!

కూల్చివేతలే కాదు సుందరీకరణే తమ లక్ష్యమని ప్రకటించిన హైడ్రాకు చెరువుల పునరుద్ధరణలో అడుగడుగునా చుక్కెదురవుతున్నది. బెంగళూరు పర్యటన తర్వాత నల్లచెరువు, సున్నంచెరువు, ఎర్రగుంట చెరువు, అప్పా చెరువుల సుందరీకరణకు సంబంధించిన పైలట్ ప్రాజెక్ట్‌ను పూర్తి చేయాలని హైడ్రా కమిషనర్ తమ బృందంతో చర్చించారు. ఇందుకు సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేయాలని బెంగళూరు వెళ్లే ముందు అధికారులను ఆదేశించారు. స్టడీ టూర్ నుంచి రాగానే నాలుగు చెరువుల దగ్గర కూల్చివేతల అనంతరం అక్కడ ప్రతిరోజూ ఏం జరుగుతుంది. ఎటువంటి పరిస్థితులు ఉన్నాయి.. తమకు స్థానికులు సహకరిస్తారా.. శిథిలాల తొలగింపు తర్వాత ప్రభుత్వ ఆధీనంలో ఉన్న స్థలానికి ఫెన్సింగ్ వేయడానికి అనుకూలంగా ఉంటుందా.. అనే అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో హైడ్రా కమిషనర్ సమీక్ష నిర్వహించారు. అయితే సున్నంచెరువు వద్ద కూల్చివేతల సమయంలో జరిగిన గొడవ, కోర్టు కేసులు కూడా ఉండటంతో.. ఫెన్సింగ్ వేసే వరకు ఆచితూచి అడుగు వేయాలని నిర్ణయించుకున్నారు. ఈ పరిస్థితులను అంచనా వేయడానికి పదిహేను రోజుల పాటు చెరువుల వద్ద డ్రోన్ ద్వారా సర్వే చేశారు. మరోవైపు రెవెన్యూ, ఇరిగేషన్, హైడ్రా అధికారుల బృందం అక్కడకు వెళ్లి పరిస్థితులను పరిశీలించారు. ఇదే సమయంలో నాలుగు చెరువులను సుందరీకరించడానికి అయ్యే ఖర్చుపై అంచనా వేసినట్లు తెలిసింది. ఈ పైలట్ ప్రాజెక్ట్‌లోని చెరువుల అభివృద్ధికి అయ్యే నిధులెంత.. అసలు ఏ మేరకు ఎలా అభివృద్ధి చేయగలమనే అంశాలపై సంబంధిత శాఖ అధికారులతో కమిషనర్ అంతర్గతంగా సమావేశం నిర్వహించారు. ఆ తర్వాత చెరువుల సుందరీకరణ ముచ్చటే పక్కకు పోయింది. ఇప్పుడంతా రోడ్లు, ప్రభుత్వ స్థలాల ఆక్రమణలపై హైడ్రా దృష్టిపెడుతున్నది. ఇంతకూ పైలట్ ప్రాజెక్ట్ ఆగిపోవడానికి బడ్జెట్ లేకపోవడమే కారణమని తెలుస్తున్నది. బడ్జెట్ లేకపోవడంతో పాటు స్థానికంగా ఉన్న పరిస్థితులు, ఈ చెరువుల సుందరీకరణకు ఎక్కువ సమయం పట్టే అవకాశం ఉండటం కారణాలుగా హైడ్రా బృందంలో చర్చ జరుగుతున్నది.

### మొదట రెండు చెరువులపైనే దృష్టి..!

పైలట్ ప్రాజెక్ట్‌ను పూర్తి చేయడానికి అనుకూలమైన పరిస్థితులు లేకపోవడంతో అంబర్‌పేటలోని బతుకమ్మకుంట, తార్నాకలోని ఎర్రకుంటలపై హైడ్రా దృష్టి పెట్టింది. ఈ రెండు చెరువులకు స్థానికుల నుంచి సహకారం అందడంతో వీటిని ఎంచుకున్నది. ఈ నేపథ్యంలో బతుకమ్మకుంటను సుందరీకరించడానికి పనులు మొదలుపెట్టింది. స్థానికంగా అనుకూలమైన వాతావరణం ఉండటం, తమ ప్రాజెక్ట్‌లో ఈ చెరువు లేకపోయినా.. ఆక్రమణలు పోను మిగిలిన ఐదెకరాల స్థలాన్ని హైడ్రా స్వాధీనం చేసుకుంది. ఇక్కడ బతుకమ్మకుంటను సుందరీకరించడానికి కావలసిన సంస్థల భాగస్వామ్యం కోరుతున్నట్లు సమాచారం. ఇందుకోసం స్థానిక కాంగ్రెస్ నేతలు వీహెచ్, రోహన్‌రెడ్డి సహకారం తీసుకోవాలనుకుంటున్నట్లు తెలిసింది. ఈ విషయంపై ఇప్పటికే వారితో కమిషనర్ రంగనాథ్ మాట్లాడారని, బడ్జెట్ ఇతర అంశాలపై కూడా చర్చించారని తెలిసింది. మరోవైపు తార్నాకలోని ఎర్రగుంట చెరువు అభివృద్ధికి కూడా ఎలాంటి అడ్డంకులు లేకపోవడంతో పాటు కొన్ని ఆక్రమణలు తొలగించాలని స్థానికులే కోరుతుండటంతో ఈ రెండు చెరువులపై హైడ్రా దృష్టిపెడుతున్నది. బతుకమ్మకుంట, ఎర్రగుంటలను ఎలా సుందరీకరించాలనే విషయంపై బెంగళూరు సామాజిక కార్యకర్త ఆనంద్ మల్లిగవాడ్‌తో రంగనాథ్ చర్చించారు. బీఆర్‌ఎస్ హయాంలో సుందరీకరించిన రెండు చెరువులను సోమవారం సందర్శించారు. చెరువుల విస్తీర్ణాన్ని బట్టి బతుకమ్మకుంట, ఎర్రగుంట చెరువుల సుందరీకరణను వేగవంతంగా పూర్తి చేయాలనుకుంటున్నట్లు తెలిసింది. వీటి తర్వాత తక్కువ విస్తీర్ణంలో ఉన్న చెరువులను ఎంపిక చేసుకుని వాటిని సుందరీకరించాలనుకుంటున్నట్లు హైడ్రా అధికారి ఒకరు చెప్పారు.



సున్నం చెరువు




ఆదిబట్ల : రంగారెడ్డి కలెక్టరేట్ వద్ద నిర్వహించిన రిలే నిరాహార దీక్షలో మాట్లాడుతున్న శ్రీనివాస్